సాక్షి కామారెడ్డి

ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



అభివృద్ధే ధ్యేయంగా..

భిక్కనూరు ఏఎంసీ పాలకవర్గం శనివారం ప్రమాణ స్వీకారం చేసింది. షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్ పాల్గొన్నారు.

- 8లో ▸



మందుల్లేవ్!

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మందుల కొరత తీరడం లేదు. దీంతో మెడికల్ షాప్‌లలో కొనుక్కోవాల్సి వస్తోంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.7/22.5

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నిజాంసాగర్‌లోకి 8 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శనివారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 8 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు నాలుగు వరద గేట్లను ఎత్తి 20 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా 1,404.98 అడుగుల(17.773 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

కళ్యాణి'లోకి 150 క్యూసెక్కులు..

ఎల్లారెడ్డి: తిమ్మారెడ్డి శివారులోని కళ్యాణి ప్రాజెక్టులోకి శనివారం 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తి అంతే నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు.

జీజీహెచ్‌లో పోస్టులపై ఆసక్తి చూపని వైద్యులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి స్పందన కరువైంది. 28 వైద్య పోస్టుల భర్తీ కోసం గతనెలలో దరఖాస్తులు ఆహ్వానించగా.. శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు ముగ్గురు వైద్యులు మాత్రమే హాజరయ్యారు. వారు కూడా విధుల్లో చేరడానికి ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. ఆస్పత్రిలో పనిచేయడానికి ఎవరూ ఆసక్తి చూపకపోవడం చర్చనీయాంశంగా మారింది.

'పకడ్బందీగా సర్వే చేయాలి'



బాన్సువాడ రూరల్: హెల్త్ ప్రొఫైల్ సర్వేను అధికారులు సమగ్రంగా చేపట్టాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. శనివారం నాగారంలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలన్నారు. గ్రామస్తులు సర్వే అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నవీన్, సృజన్‌రెడ్డి పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ విషయమై జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ-1, ఉర్దూ -1, బిచ్కుంద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియం గణితం-1 పోస్టు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన వారు ఈనెల 10వ తేదీలోపు జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జీజీహెచ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

- సమయ పాలన పాటించని వైద్యుల తీరుపై ఆగ్రహం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని శనివారం ఉదయం 9.30 గంటలకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆస్పత్రిలో నలుగురు వైద్యులు మాత్రమే ఉన్నారు. 9.45 గంటల వరకు సూపరింటెండెంట్ రాంసింగ్‌తో పాటు హెచ్‌వోడీలు, వైద్యులు రాకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోనే ఉండి పరిశీలించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి సూచించి వెళ్లిపోయారు. అదనపు కలెక్టర్ 10.30 గంటల వరకు సూపరింటెండెంట్ చాంబర్‌లో ఉండి పరిశీలించారు. కలెక్టర్ వచ్చిన విషయం తెలుసుకున్న వైద్యులు హడావుడిగా ఆస్పత్రికి వచ్చారు. మధ్యాహ్నం సూపరింటెండెంట్‌తో పాటు హెచ్‌వోడీలు, వైద్యులను కలెక్టరేట్ కార్యాలయానికి రప్పించుకుని ఆస్పత్రి సమస్యలు, వైద్యుల తీరుపై సమీక్ష నిర్వహించారు. సమయపాలన పాటించని వైద్యులకు మెమోలు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది. కలెక్టర్ వెంట ఆర్డీవో రంగనాథ్‌రావు, తహసీల్దార్ జనార్దన్, వైద్యాధికారులు శరత్, జైన్, వెంకట్ తదితరులున్నారు.

గోల్‌పోస్ట్‌కు పెట్టని కోట..



నందిని హ్యాండ్‌బాల్ క్రీడలో గోల్‌కీపర్. గోల్ పోస్ట్‌కు పెట్టని కోటలా నిలుస్తుంది. ఆమె చక్కటి ప్రతిభతో రెండుసార్లు స్టేట్‌లెవల్‌కు ఎంపికైంది. మంచిర్యాలతో పాటు మహబూబ్‌నగర్‌లలో జరిగిన పోటీల్లో పాల్గొని సత్తా చాటింది.

రెండుసార్లు ప్రాతినిధ్యం



వైష్ణవి హ్యాండ్ బాల్ క్రీడలో ఆరితేరింది. ఆమె చేతికి బాల్ చిక్కిందంటే గోల్ పోస్టుకు చేర్చి తీరుతుందని జట్టు సభ్యులు నమ్ముతారు. రెండుసార్లు స్టేట్ లెవల్ పోటీలలో పాల్గొని, గుర్తింపు పొందింది.

స్టేట్ లెవల్‌లో ఒకసారి



భానుప్రియ నిత్యం హ్యాండ్‌బాల్ ప్రాక్టీస్ చేస్తుంటుంది. మంచి క్రీడాకారిణిగా గుర్తింపు సంపాదించింది. ఆటలో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఒకసారి ఎంపికైంది. గతేడాది మంచిర్యాలలో జరిగిన పోటీల్లో పాల్గొంది.

ఆటలో నేర్పరి



మధుప్రియ హ్యాండ్ బాల్ కోర్టులో చిరుతలా కదులుతూ ప్రత్యర్థులను దెబ్బతీస్తుంది. గతేడాది జిల్లాస్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. మంచిర్యాలలో జరిగిన పోటీలలో పాల్గొని ప్రతిభ చూపింది.

బంతితో ఆటాడుకుంటూ..



మేనక బాల్‌తో ఆటాడుకుంటుంది. కోర్టులో ప్రత్యర్థికి అంతుచిక్కని రీతిలో కదులుతూ గోల్స్ చేస్తుంటుంది. ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన స్టేట్‌లెవల్ పోటీల్లో పాల్గొని సత్తాచాటింది.

వారు అడుగిడితే మైదానానికి కళ వస్తుంది. కోర్టులో కదులుతుంటే చిరుతలు చిన్నబోతాయి. బంతిని విసిరితే గోల్‌పోస్టును చేరి తీరుతుంది. వారే మత్మల్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు. సరైన సౌకర్యాలు లేకపోయినా హ్యాండ్‌బాల్ క్రీడలో రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చూపుతున్నారు. ప్రోత్సాహం అందిస్తే జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతామని పేర్కొంటున్నారు.



పాఠశాల ఆవరణలో ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు

బంతి విసిరితే.. గోల్ పోస్ట్ చేరాల్సిందే!

సండే స్పెషల్

- హ్యాండ్ బాల్ క్రీడలో రాణిస్తున్న మత్మల్ విద్యార్థులు
- ప్రోత్సహిస్తే జాతీయ స్థాయిలో సత్తా చాటుతామంటున్న క్రీడాకారిణులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని మత్మల్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సతీశ్‌రెడ్డి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు. ఆయన తాను పనిచేసే పాఠశాలలోని విద్యార్థినులలోగల ప్రతిభను గుర్తించి 2020లో హ్యాండ్ బాల్ క్రీడలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. విద్యార్థులు సైతం కష్టపడి సాధన చేస్తూ, మెలకువలు నేర్చుకున్నారు. నాలుగేళ్లలో 20 మంది విద్యార్థినులను హ్యాండ్‌బాల్ ఆటలో తీర్చిదిద్దారు. గతేడాది స్టేట్ లెవల్ పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ఆడారు.



అంతర్‌జిల్లా టోర్నీలో ద్వితీయ స్థానంలో నిలిచిన మత్మల్ జట్టుతో పీడీ (ఫైల్)

ఈసారి ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో రాణించిన ఐదుగురు విద్యార్థినులు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నారు. చదువుకుంటూనే ఆటల్లో రాణిస్తున్నారు. జిల్లాలో కొన్ని గురుకుల పాఠశాలల్లో మాత్రమే హ్యాండ్‌బాల్ ఆట ఉండగా.. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఒక్క మత్మల్‌లోనే హ్యాండ్‌బాల్ ఆడుతున్నారు.

సౌకర్యాలు లేకపోయినా..

పాఠశాలలో హ్యాండ్‌బాల్‌కు సరైన సౌకర్యాలు లేవు. స్కూల్‌లో చదువుతున్నవారిలో చాలా మంది పేద కుటుంబాలకు చెందినవారే. దీంతో ఆటకు కావాల్సిన వస్తువులు, దుస్తులు కొనుగోలు చేయడంతో పాటు బలవర్ధకమైన ఆహారం తీసుకోవడానికి ఇబ్బందులు ఉన్నాయి. అయినా విద్యార్థులు ఆటలో మాత్రం ప్రతిభ చూపుతూనే ఉన్నారు. అయితే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లడానికీ ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మారుమూల ప్రాంతం నుంచి హ్యాండ్‌బాల్ ఆటలో రాష్ట్ర స్థాయికి ఎదిగిన విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందిస్తున్నారు. మారుమూల గ్రామాలకు చెందిన విద్యార్థినులు అంతర్జాతీయ క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎదగడం మామూలు విషయం కాదని, వారికి సరైన ప్రోత్సాహం లభిస్తే మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారని క్రీడాభిమానులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులూ తయారయ్యే అవకాశాలుంటాయి.

నైపుణ్యం ఉన్న క్రీడాకారులు..



పాఠశాలలో హ్యాండ్ బాల్ క్రీడలో శిక్షణ మొదలు పెట్టిన తొలి నాళ్లలోనే విద్యార్థులు మంచి నైపుణ్యాలు నేర్చుకున్నారు. సమయం చిక్కితే చాలు మైదానానికి వెళ్లి ప్రాక్టీస్ చేస్తారు. ఇప్పటికే పలువురు విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తా చాటారు. మా స్థాయిలో మేం వారిని ప్రోత్సహిస్తున్నాం. ప్రభుత్వం వారికి కావలసిన సౌకర్యాలు కల్పించి అండగా నిలిస్తే మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారు.

– సతీశ్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్

'క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి'

కామారెడ్డి క్రైం: క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సీఎం కప్-2024 క్రీడల ప్రచారానికి సంబంధించిన ప్రత్యేక రన్ కార్యక్రమం శనివారం కామారెడ్డికి చేరుకుంది. జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్‌లో జాతీయ రహదారి వద్ద సీఎం కప్ రన్‌కు కలెక్టర్ స్వాగతం పలికారు. జెండా ఊపి కామారెడ్డిలో 10 కె రన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సీఎం కప్-2024 క్రీడలను నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో 48 కిలోమీటర్ల మేర రన్ సాగుతుందన్నారు. సిరిసిల్ల రోడ్ నుంచి కామారెడ్డి బస్ స్టాండ్ వరకు 10 కిలోమీటర్ల మేర రన్ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, డీఎస్పీ రాజేశ్వర్ రావు, జిల్లా యువజన సంక్షేమ అధికారి జగన్నాథన్, మున్సిపల్ కమిషనర్ సుజాత, క్రీడాకారులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



రన్‌లో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

'క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు'

కామారెడ్డి టౌన్: క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎస్పీ సింధు శర్మ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రొబెల్స్ స్కూల్ మైదానంలో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అంతర్జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్ బ్యాడ్మింటన్ మనదేశంలోనే పుట్టిందన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్యతో పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు వస్తాయన్నారు. పోటీలు నిర్వహిస్తున్న తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు లోయపల్లి నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి వీవీ రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గయ్య, ప్రతినిధులు వీరభద్రరావు, రవీంద్ర కుమార్, కమల్ కుమార్, శ్యామ్, తిరుపతి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ

బీకేఎస్ మహాసభలు విజయవంతం

- తరలివచ్చిన రైతులు
- పలు తీర్మానాలకు ఆమోదం



మహాసభలను ప్రారంభిస్తున్న బీకేఎస్ జాతీయ కార్యదర్శి మోహిని మోహన్ మిశ్రా, ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. బీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జోగినపల్లి శ్రీరంగరావు అధ్యక్షతన జరిగిన సభలకు వివిధ జిల్లాలనుంచి రైతులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతుల కోసం వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్రంలో మూతపడిన చక్కెర కర్మాగారాలను వెంటనే ప్రారంభించాలని, పంట బీమా పథకం అమలు చేయాలని, పాలు, వ్యవసాయ ఉత్పత్తుల కల్తీ అరికట్టాలని, భూసమస్యలు, రెవెన్యూ అంశాలను పరిష్కరించాలని, కూరగాయల మార్కెట్, వ్యవసాయ మార్కెట్‌ల అవకతవకలు జరగకుండా చూడాలని తీర్మానాలు చేశారు. మహాసభలో బీకేఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేశం పాల్గొన్నారు.



తీర్మానాలకు మద్దతు తెలుపుతున్న రైతులు

'యాదగిరి గుట్ట'లో కొలువైన దుర్గమ్మ



జనగామలో యాదగిరి గుట్ట నమూనాలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం



మండపంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

జనగామ గ్రామంలో దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భారీ సెట్టింగ్ వేశారు. యాదగిరి గుట్ట ఆలయాన్ని పోలిన ఈ సెట్టింగ్‌కు రూ. 12 లక్షలు వెచ్చించారు. ఈ మండపంలో దుర్గామాతను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ప్రత్యేక శిక్షకులతో గ్రామస్తులకు దాండియా నేర్పిస్తున్నారు. రోజూ సుమారు 200 మంది సాయంత్రం నుంచి రాత్రి వరకు దాండియా ఆడుతున్నారు. రాత్రి వేళలో విద్యుత్ దీపాల కాంతిలో సెట్టింగ్ ఆకట్టుకుంటోంది. ఈ మండపాన్ని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాలనుంచి భారీగా జనం తరలివస్తున్నారు. శనివారం మండపంలో సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

– బీబీపేట

ముగిసిన డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్

- 1,157 మంది అభ్యర్థులు హాజరు
- రేపు అర్హుల జాబితా ప్రకటించే అవకాశం

కామారెడ్డి టౌన్ : డీఎస్సీ -2024 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన శనివారంతో ముగిసింది. డీఈవో కార్యాలయంలో సర్టిఫికెట్లను పరిశీలించారు. జిల్లాలో 506 పోస్టుల భర్తీకిగాను 1:3 పద్ధతిలో 1,216 మంది అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఆహ్వానించగా.. 1,157 మంది హాజరయ్యారు. 59 మంది సర్టిఫికెట్ల పరిశీలనలో పాల్గొనలేదు.

అర్హుల జాబితాపై ఉత్కంఠ

సర్టిఫికెట్ల పరిశీలన పూర్తవడంతో మార్కులు, రిజర్వేషన్‌ల ప్రకారం ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొందిన అర్హుల జాబితాను సోమవారం ప్రకటించనున్నారు. దీంతో జాబితాలో తమ పేరు ఉంటుందో లేదోనని అభ్యర్థులు ఉత్కంఠతో ఉన్నారు. ఎంపికైనవారికి ఈనెల 9వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందించనున్నారు.

ఫేక్ సర్టిఫికెట్లు సమర్పిస్తే క్రిమినల్ చర్యలు..

ఎవరైనా ఫేక్ సర్టిఫికెట్‌లను సమర్పిస్తే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు, రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన సంస్థ డైరెక్టర్ గాజర్ల రమేశ్ డీఈవో రాజుకు సూచించారు. శనివారం ఆయన డీఈవో కార్యాలయంలో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా సర్టిఫికెట్లను పరిశీలించి, ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపరచాలని సూచించారు. అనంతరం విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినర్ బలరాం, జిల్లా సమన్వయకర్తలు వేణుగోపాల్, నాగవేందర్, వెంకటరమణారావు, కృష్ణ చైతన్య, కార్యాలయ పర్యవేక్షకులు రాజేశ్వరరావు, భాస్కర్, వినయ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మందులు లేవు.. బయట కొనుక్కోండి

- జీజీహెచ్‌లో రెండు నెలలకుపైగా తీరని సమస్య
- 80 శాతం వరకు ఔషధాల కొరత



పూర్తిగా మందులు ఇవ్వలేదని చీటీ చూపిస్తున్న గర్భిణి కృతిక



జీజీహెచ్‌లో ఫార్మసీ వద్ద క్యూలో ఉన్న రోగులు

కామారెడ్డి టౌన్: రెండు నెలలకు పైగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మందుల కొరత సమస్య అలాగే ఉంది. ప్రభుత్వం నుంచి పూర్తిగా మందుల సరఫరా కాకపోవడంతో ఉన్న అరకొర మందులతో సర్దుతున్నారు. శనివారం ఔట్ పేషంట్ విభాగంలో రోగులకు వైద్యులు పరీక్షించి మందుల చీటి రాయగా దాదాపు అందరికి అరకొర మందులనే ఫార్మసీ విభాగంలో ఇచ్చి పంపించారు. లేని వాటిని చీటీపై టిక్కులు పెట్టి బయట తీసుకోవాలని ఫార్మాసిస్టులు చెప్పి పంపించారు. దీంతో కొందరు బయట తీసుకోగా, మరికొందరు ఇచ్చిన వాటితో సర్దిపెట్టుకుని ఇంటికి వెళ్లారు. గ్లూకోజ్ బాటిళ్లు, సిరంజీలు, ఎముకలకు కట్టే పీవోపీ పట్టీలు, యాంటిబయాటిక్స్, దగ్గు, జలుబు, ఐ డ్రాప్స్, ఐవీ క్యానూల, ఆయింట్‌మెంట్స్ ఇలా ప్రధానమైన మందులు సుమారు 80 శాతం వరకు ఆస్పత్రిలో అందుబాటులో లేవు. మందుల కోసం రోగులు వైద్యులను, అధికారులను, ఫార్మాసిస్టులను నిలదీస్తున్నారు. ఆస్పత్రిలో మెడికల్ స్టోర్స్‌లో ఉన్న మందులనే రాయాలని రాష్ట్ర అధికారులు ఆస్పత్రి అధికారులకు అనధికారికంగా ఆదేశించినట్లు సమాచారం. ఇదేం కర్మరా బాబూ అనుకుంటూ వారి బాధలు మింగలేక కక్కలేక వైద్య సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో మందులు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

అలరించిన బాల గాయకుడు వికాస్



కామారెడ్డి అర్బన్: పుట్టుకతోనే అంధుడైన గాంధారి మండలం లొంకతండాకు చెందిన బాల గాయకుడు బానోత్ వికాస్ శనివారం కామారెడ్డిలో జరిగిన భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభలో తన పాటలతో అలరించాడు. రైతుల కష్టాలపై బాలుడు పాడిన పాటలకు అక్కడున్న వారంతా ముగ్ధులయ్యారు. బీకేఎస్ రాష్ట్ర నాయకులు పలువురు రూ.20 వేలు వరకు ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. వికాస్ ప్రతిభను గుర్తించిన పలువురు ఫొటోలు దిగారు.

పిల్లల్లో పోషకాహారలోపం లేకుండా చూసుకోవాలి

రాజంపేట: పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాజంపేట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విజయ మహాలక్ష్మి అన్నారు. ఆరేపల్లి, ఆరేపల్లి తండా గ్రామాలలోని అంగన్వాడి కేంద్రంలో శనివారం పోషకాహార లోపం కలిగిన సుమారు 25 మంది పిల్లలను పరీక్షించారు. తగు సూచనలు చేశారు. సూపర్‌వైజర్ గంగామణి, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌లో విద్యార్థిని ప్రతిభ



బాన్సువాడ: బాన్సువాడ పట్టణానికి చెందిన కోణాల సమితారెడ్డి బీఈ సివిల్ విభాగంలో యూనివర్సిటీ స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించింది. పాత బాన్సువాడకు చెందిన చెందిన సమితారెడ్డి బీఈ సివిల్ విభాగంలో 82.77 గ్రేడ్ సాధించి ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో నాలుగో ర్యాంకు సాధించింది. యూనివర్సిటీ బాధ్యులు సమితారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆమె తండ్రి కోనాల గంగారెడ్డి, కుటుంబ సభ్యులు అభినందించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

మద్నూర్(జుక్కల్): రైతులు కష్టపడి పండించిన సోయాబీన్ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే ప్రభుత్వ సోయాబీన్ పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్‌కు వచ్చిన సోయాబీన్ పంటకు ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. క్వింటాల్ సోయాబీన్ పంటను రూ.4,892తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఎకరాకు ఆరు క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆయన దృష్టికి తీసుకురావడంతో.. వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

పంచాయతీ కార్మికుల వినతి

ఆరు నెలలుగా జీపీ పారిశుధ్య కార్మికులు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు సకాలంలో అందేటట్లు కృషి చేస్తానని ఎమ్మెల్యే కార్మికులకు హామీ ఇచ్చారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పార్టీ అధ్యక్షుడు సాయిలు, సీనియర్ నాయకులు హన్మండ్లు స్వామి, రమేశ్, రాంపటేల్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం

బాన్సువాడ: పట్టభద్రులందరూ ఓటు నమోదు చేయించుకోవాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భునేకర్ సంతోష్ అన్నారు. శనివారం బాన్సువాడలోని బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఓటరు నమోదు కార్యక్రమం నవంబర్ 6 వరకు ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు కిష్టయ్య, నరసయ్య ఉన్నారు.

ఘనంగా దీపోత్సవం



భిక్కనూరు: జంగంపల్లిలోని దుర్గా సేవా సమితి మండపం వద్ద శనివారం రాత్రి దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని దీపాలను వెలిగించారు. శివలింగం, ఓంకారం, స్వస్తిక్ ఆకారంతో పాటు దుర్గాదేవి ఆకారంలో దీపాలను వెలిగించారు.

ఫస్ట్ ర్యాంకర్‌కు సన్మానం



బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన మాసిని నగేష్ డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్(సోషల్) విభాగంలో జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించడంతో ఆయన్ను శనివారం సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, ఆగ్రో చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు ఘనంగా సన్మానించారు.పేద కుటుంబానికి చెందిన నగేష్‌కు జిల్లా ఫస్ట్ ర్యాంకు రావడం అభినందనీయమని అన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలి

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



భిక్కనూరులో ఏఎంసీ పాలకవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న షబ్బీర్ అలీ, షెట్కార్

భిక్కనూరు: ప్రజల చేతిలో చావుదెబ్బతిన్న కేసీఆర్ ఫాంహౌజ్‌లో సేద తీరుతుండగా ఆయన కుమారుడు కేటీఆర్, అల్లుడు హరీష్‌రావులు ప్రజలను మభ్యపెట్టడంతో బిజీబిజీగా ఉన్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు. శనివారం భిక్కనూరు ఏఎంసీ ప్రమాణ స్వీకారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలప్పుడే పార్టీలను చూడాలని ఎన్నికలయ్యాక అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. రైతు సంక్షేమానికి కేసీఆర్ పదేళ్ల పాలనలో రూ.25 వేల కోట్లు వెచ్చిస్తే సీఎం రేవంత్‌రెడ్డి తన తొమ్మిది నెలల పాలనలో రూ.25 వేల కోట్లను వెచ్చించారన్నారు. పదేళ్ల క్రితం అద్దె ఇళ్లలో ఉన్న ఎమ్మెల్సీ కవిత, ఎంపీ సంతోష్‌రావులకు నేడు హైదరాబాద్‌లో సొంత ఇళ్లు ఎన్నో ఉన్నాయన్నారు.

రైతు రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం: షెట్కార్

రైతు రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ఆరు నూరయినా సరే ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు 21, 22 ప్యాకేజీ పనులు పూర్తి చేసి కామారెడ్డి ప్రాంతంలోని భూములను సస్యశ్యామలం చేస్తామని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. శనివారం ఆయన భిక్కనూరు ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని రైతులు, ప్రజలనుద్దేశించి మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్సార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీల చిరకాల స్వప్నమైన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రం కేసీఆర్ హయాంలో రూ.7 లక్షల 50 వేల కోట్ల అప్పుల్లోకి వెళ్లిందన్నారు. షబ్బీర్‌అలీ చొరవతోనే భిక్కనూరు ఏఎంసీ 2013లో ఏర్పాటైందని గుర్తు చేశారు కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, నేతలు జనగామ వేణుగోపాల్‌రెడ్డి, బల్యాల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం ప్రమాణ స్వీకారం

భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా పాత రాజు, వైస్ చైర్మన్‌గా పాపనోల్ల స్వామి డైరెక్టర్లుగా తోట రమేష్, కదిరే గోపాల్‌రెడ్డి, పోగుల సాయిలు, భిక్కాజీ దిలీప్‌కుమార్, లంబాడి భాస్కర్, కల్లూరి సిద్ధరాములు, నాగార్తి రమేష్‌రెడ్డి, బాబుమియా, తాటికొండ మల్లేషం, బలుస్కుల మమత, కొడిప్యాక వెంకటేశం, యెర్రం అమర్, గంగళ్ల భూమయ్యలు ప్రమాణ స్వీకారం చేశారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు



నివాళులర్పిస్తున్న ఎస్పీ సింధు శర్మ

కలెక్టరేట్‌లో కాకాకు నివాళి

కామారెడ్డి క్రైం: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతిని శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. డీఆర్‌డీవో సురేందర్, అధికారులు పాల్గొన్నారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సింధు శర్మ నివాళులర్పించారు. ఏఎస్పీ నరసింహారెడ్డి, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆకాల వర్షానికి తడిసిన ధాన్యం!



తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు సాయిలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలో శుక్రవారం రాత్రి, శనివారం కురిసిన అకాల వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట, పోచారం, చీనూర్ తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల శివారులో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. వర్షపునీటి ధారలో ధాన్యం కొట్టుకుపోయింది. చేతికొచ్చిన వరిపంటలు నేలకొరిగాయి.

వన్య ప్రాణులను సంరక్షించాలి



రాజంపేట: పర్యావరణ పరిరక్షణలో భాగంగా పక్షులు, జంతువులను సంరక్షించుకోవాలని కామారెడ్డి అటవీ శాఖ క్షేత్ర అధికారి వి.రమేశ్ అన్నారు. వన్యప్రాణి రక్షణ వారోత్సవాల్లో భాగంగా శనివారం రాజంపేట మండలంలోని నడిమితండా, ఇనాంతండాలలో అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. అటవి జంతువులను వేటాడడం, చంపడం చట్టరీత్యా నేరమన్నారు. భూమిపై జీవించే హక్కు ప్రతి జీవికి ఉందన్నారు. మాజీ సర్పంచ్ వినోద్, సెక్షన్ అధికారి బాబా, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలను నిర్వహించారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు.

క్రైం కార్నర్

పాన్‌షాప్ దగ్ధం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు ఓ పాన్ షాప్ దగ్ధమైంది. అటుగా వెళ్తున్న వారు గమనించి పాన్‌షాప్ యజమాని సతీశ్‌తోపాటు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. సుమారు లక్షన్నర ఆస్తినష్టం సంభవించినట్లు బాధితుడు సతీశ్ తెలిపారు.

జేబుదొంగల చేతివాటం

భిక్కనూరు: మండల కేంద్రంలోని గంజ్ ప్రాంతంలో శనివారం నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ కార్యక్రమంలో జేబు దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. నాయకుల జేబుల్లో నుంచి నగదు చోరీ చేశారు. మాజీ ఎంపీపీ తోగరి సుదర్శన్ జేబులో నుంచి రూ.10 వేలు, రాజంపేట మండలానికి చెందిన రాజు జేబులో నుంచి రూ.5,600, సాయిలు జేబులో నుంచి రూ.2,200, కామారెడ్డి పట్టణానికి చెందిన ఓ నాయకుడి జేబులో నుంఇ రూ.11,700 చోరీ చేశారు.

పరిస్థితి విషమించి ఒకరి మృతి

భిక్కనూరు: ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన భిక్కనూరు మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కోరె బీరయ్య(50) రెండేళ్లుగా ఎలాంటి పనులు చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తితో గత నెల 25న బీరయ్య కల్లులో పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబీకులు కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

నిజామాబాద్ రూరల్: మండలంలోని ఆకుల కొండూర్ గ్రామంలోని లిఫ్ట్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి దుండగులు కాయిల్స్ ఎత్తుకెళ్లినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ తెలిపారు. శనివారం లిఫ్ట్ వద్దకు వెళ్లిన గ్రామస్తులు ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ అయినట్లు గుర్తించారన్నారు.

గోవులను తరలిస్తున్న వాహనం అడ్డగింత

- ఇరువర్గాల మధ్య వాగ్వాదం
- నస్రుల్లాబాద్‌లో భారీగా మోహరించిన పోలీసు బలగాలు

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో గోవులను రవాణా చేస్తున్న వాహనాన్ని బీజేపీ భజరంగ్‌దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారు. బాన్సువాడ పట్టణ కేంద్రానికి చెందిన ఖురేషి అనే వ్యక్తి నిజామాబాద్ నుంచి బాన్సువాడకు గోవులను తరలిస్తున్న విషయం తెలుసుకున్న భజరంగ్‌దళ్ నాయకులు నస్రుల్లాబాద్‌లో అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ సీఐ సత్యనారాయణగౌడ్, బీర్కూర్ ఎస్సై రాజశేఖర్, ఏఆర్ పోలీస్ బలగాలతో ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. వాహన డ్రైవర్ ఖురేషిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకట్రావు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ వద్ద రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు శనివారం పట్టుకున్నారు. పాల్వంచ మండలం భవానీపేట తండాకు చెందిన బానోత్ రాములు రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి



పల్లె పద్మారావు(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్ గ్రామానికి చెందిన పల్లె పద్మారావు(47) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పోచారం ప్రధాన కాలువలో పడి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గత నెల 25వ తేదీన ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన పద్మారావు తిరిగిరాకపోవడంతో పలుచోట్ల గాలించిన కుటుంబ సభ్యులు చివరికి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా శనివారం గ్రామశివారులోని పోచారం ప్రధానకాలువ కల్వర్టు మెట్ల వద్ద మృతుడి చెప్పులు కనిపించడంతో జాలర్ల సహాయంతో గాలించారు. ప్రధానకాలువలోని తుమ్మచెట్టు ముళ్ల కింద నీటిలో పద్మారావు మృతదేహం లభ్యమైంది. పద్మారావు ప్రమాదవశాత్తు ప్రధానకాలువలో పడి మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో ఉమేశ్ తెలిపారు.

కుంటలో పడి..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్ ప్రాంతానికి చెందిన దాల్ మల్క నర్సింలు(40) ప్రమాదవశాత్తు కరుణం కుంటలో పడి మృతి చెందాడని పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన శుక్రవారం రాత్రి మద్యం సేవించిన నర్సింలు తన ఇంటి సమీపంలోని కుంటలో ప్రమాదవశాత్తు పడిపోయాడని, స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకొని నర్సింలు మృతదేహాన్ని బయటికి తీయించామన్నారు. మృతుడికి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పీడీఎస్ సిండికేట్‌లో కలవడం లేదని దాడి

ఖలీల్‌వాడి: పీడీఎస్ బియ్యం దందా సిండికేట్‌లో కలవడం లేదని ఓ గ్యాంగ్ మరో గ్యాంగ్‌పై దాడికి పాల్పడినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రాండ్ ప్లాజా వద్ద మజార్ అలియాస్ చోటు, హంజల, నోమాన్ అనే యువకులపై సిద్ధిఖీ, అఫ్సర్ అనే ఇద్దరు అన్నదమ్ములతోపాటు మరి కొంత మంది కలిసి దాడి చేశారు.

ఒకేసారి గ్యాంగ్ దాడి చేయడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. గాయాలపాలైన వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి సమావేశమైన రెండు గ్యాంగ్‌లు పీడీఎస్ బియ్యం దందాను కలిసి చేయాలని నిర్ణయానికి వచ్చారు. శనివారం ఓ గ్యాంగ్ వారు పీడీఎస్ బియ్యం దందాను వేరుగా చేయడంతో మరో గ్యాంగ్ వారు దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఈ ప్రాంతంలో పీడీఎస్ బియ్యం దందా యథేచ్ఛగా కొనసాగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కారును ఢీకొన్న లారీ



ఘటనాస్థలంలో లారీ, కారు

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ శివారులో కారును లారీ ఢీకొన్న ఘటనలో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలైనట్లు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తాడ్వాయి మండలం బ్రాహ్మణ్‌పల్లి గ్రామానికి చెందిన మరాఠి శ్యామ్‌కుమార్ తన కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బంధువులను తీసుకుని వస్తుండగా బస్వాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న లారీ అతి వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొన్నది. కారు కామారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ వైపు మళ్లింది. దీంతో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఖలీల్‌వాడి: రోడ్డు దాటుతున్న ఓ మహిళను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటన జిల్లా కేంద్రంలోని దేవీ థియేటర్ చౌరస్తా వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బోధన్‌కు చెందిన గోసం గంగు, భర్త రాజులు పని నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చారు. పులాంగ్ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు దేవీ థియేటర్ చౌరస్తాలో ఢీకొన్నది. ఈ ఘటనలో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని బాధిత కుటుంబీకులు డ్రైవర్‌తో గొడవ పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇరువురిని సముదాయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

భిక్కనూరులో వానరాల దండు



భిక్కనూరు: వానరాల దండు రోడ్లపైకి రావడంతో మండల కేంద్రవాసులు బెంబేలెత్తారు. శనివారం మండల కేంద్రంలోని ఊరడమ్మ దేవాలయం నుంచి పెద్ద కోతులగుంపు అంబేడ్కర్ విగ్రహం వద్దకు వచ్చింది. వీధుల్లో ఉన్న వారు భయంతో ఇళ్లలోకి వెళ్లిపోయారు. ఆ తరువాత వానరాల గుంపు సమీపంలోని కొత్త చెరువు వద్దకు వెళ్లిపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

రెజ్లింగ్‌లో ఉమ్మడి జిల్లా సత్తా



నిజామాబాద్‌నాగారం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, 17 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి (నిజామాబాద్, కామారెడ్డి) జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నారాయణపేట జిల్లాలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు కొనసాగాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు నాగమణి, హీరాలాల్ క్రీడాకారులను అభినందించారు.

అండర్ – 17: నేహాబేగం, సింధు(బంగారు), సుజిత, త్రిష, స్నేహప్రియ(కాంస్యం)

అండర్ – 14: జయశ్రీ (రజతం), కావేరి, స్రవంతి (కాంస్యం).

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయికి ఎంపిక



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14, 17కి జిల్లా కేంద్రంలోని అభ్యాస స్కూల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. క్రీడాకారులను స్కూల్ కరస్పాండెంట్ చెన్న అన్నపూర్ణ శనివారం ప్రత్యేకంగా అభినందించారు. పీఈటీ ఆకుల నాగరాజు పాల్గొన్నారు. అండర్ –17 ఫుట్‌బాల్‌కు సాయిసమీక్ష, అండర్ – 14 క్రికెట్‌కు ప్రజ్వల్, భానుచందర్ ఎంపికయ్యారు.